క్లుప్తంగా

నువ్వు చేను పనుల్లో నిమగ్నమైన రైతులు



రోడ్డుపై రైతులు ఆరబెట్టిన నువ్వుచేను

సీతానగరం: తుఫాన్ గండం ఉత్తరాంధ్రకు లేదని వాతావరణ శాఖ ప్రకటించడంతో నువ్వు పంట పండించిన రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పెదంకలాం, బూర్జ, చెల్ల న్నాయుడువలస, నిడగల్లు, లక్ష్మీపురం, వెంక టాపురం, దయానిధిపురం, రంగంపేట, సుమిత్రాపురం తదితర గ్రామాల్లో నువ్వు పంట సాగు చేశారు. పంట కోతదశకు వచ్చేసమయం కావడంతో ఆ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంటపండించడానికి అనుకూలంగా ఉన్నప్పటికీ కోతదశలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో మళ్లలో కోసిన నువ్వుచేనును కళ్లాల్లోకి తరలించేందుకు రైతులు సిద్ధమయ్యారు.

మంచినీటి పైప్‌లైనుకు మరమ్మతులు



పెదభోగిలిలో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సీతానగరం: మండలంలోని పెదభోగిలిలో మంచినీరు సరఫరా చేయాల్సిన పైప్‌లకు పంచాయతీ ఈఓ జె.వెంకటరావు పంచాయితీ మెకానిక్‌లతో ఆదివారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరగనున్న అమ్మవారి జాతరను పురస్కరించుకుని ప్రజలకు తాగునీరు సమృద్ధిగా సరఫరా చేయాలని సర్పంచ్ జె.తేరేజమ్మ సూచించిన నేపథ్యంలో ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి వీధి కుళాయిలకు తాగునీరు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. అలాగే పెదభోగిలి మేజర్ పంచాయతీలో ఉన్న గ్రామాల్లో మంచినీటి కొరత నివారణకు సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వాహనచోదకులు నియమాలు పాటించాలి

బలిజిపేట: మండలంలోని తుమరాడ, మిర్తివలస, బర్లి గ్రామాలల్లో సోమ, మంగళ, బుధ వారాల్లో జరగనున్న గ్రామదేవతల ఉత్సవాల సందర్భంగా వాహనరోదకులు, వాహనదారులు తప్పకుండా పోలీస్‌శాఖ నిర్ధారించిన నియమాలను పాటించాలని ఎస్సై ప్రశాంత్‌కుమార్ కోరారు. వాహనదారులు వాహనాలను గ్రామాల సరిహద్దుల్లో కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే ఉంచాలని సూచించారు. నిబంధనలను ఎవరూ అతిక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని కోరారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న ఇరు జట్లు

వీరఘట్టం: గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మొత్తం 28 టీమ్‌లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనగా ఇంత వరకు లీగ్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఆదివారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. సోమవారం ఉదయం సెమీస్ అనంతరం సాయంత్ర ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

వంశధారలో పెరిగిన నీటి ప్రవాహం



వంశదార నదిలో కాలినడకన ప్రయాణికులు

భామిని: మండలానికి ఒడిశాలకు మధ్య హద్దుగా ప్రవహిస్తున్న వంశధార నదిలో ఆదివారం కాస్త నీటి ప్రవాహం పెరిగింది. అకాల వర్షంతో ఒడిశా ఎగువ ప్రాంతంలో వర్షాల ప్రభావంతో నీటి మట్టం కొద్దిగా పెరిగి వాహన రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.

రక్తమిచ్చి ప్రాణదాతలు కండి



రక్తం ఇస్తున్న దాతలు

పార్వతీపురంటౌన్: ప్రాణాపాయ స్థితిలో ఉండి రక్తం కోసం ఎదురుచూసి సకాలంలో అవసరమైన గ్రూపు రక్తం అందక మృత్యువాత పడుతున్న బాధాకర పరిస్థితులు అక్కడక్కడా సంభవిస్తున్నాయి. ఆ పరిస్థితిని అధికమించి నలుగురికి ప్రాణదానం చేయాలన్న సత్‌సంకల్పం ప్రజల్లో వస్తే మరింత సానుకూల సమాజ నిర్మాణానికి కారణమవుతారని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని భావించి ఈ పవిత్ర కార్యక్రమానికి అందరూ ముందుకు వస్తే శుభపరిణామంగా భావించవచ్చు. దాతలు రక్తదానంపై ఆరోగ్యపరమైన ఇతరత్రా అపోహలను మాని మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తే వారు మరింత చురగ్గా, దేహదారుఢ్యంతో ఉంటారన్న నగ్నసత్యాన్ని విస్మరించరాదు. వైద్యులు రక్తదానంపై ఎన్నో వేదికల మీద సుదీర్ఘ చర్చోపన్యాశాలను అందించిన విషయం విదితమే. స్వచ్ఛంద సేవా సంస్థలు రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. ప్రభుత్వం కూడా ఆదిశగా అడుగు ముందుకు వేసి ప్రచారం విస్తృతం చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా దాతల సంఖ్య అమాంతం పెంచి రక్త సేకరణకు ప్రాధాన్యం ఇవ్వడంతో ఫలితాలు ఆశాజనకంగా ఉంటున్నాయి. దాతలు రక్తం ఇచ్చేటప్పుడు వారికి డోనర్ కార్డులు ఇచ్చి వారికి గాని, వారి కుటుంబసభ్యులకు గాని ఎప్పుడైనా రక్తం అవసరమైతే ఆ కార్డును వినియోగంలోకి తీసుకురాగలిగే పరిస్థితిని కల్పించడంతో దాతల సంఖ్య పెరుగుతోంది. ప్రత్యేక రోజుల్లో రక్త సేకరణ కార్యక్రమాలను చేపట్టి ఎక్కువ యూనిట్ల రక్తాన్ని సేకరించి, నిల్వచేస్తుండడంతో ప్రమాదకర పరిస్థితుల్లో రోగులకు రక్తం అక్కరకు వస్తోంది.

'నాలుగేళ్ల క్రితం ఐఆర్‌సీఎస్ రక్తనిధి కేంద్రం

పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో నాలుగేళ్ల క్రితం ఐఆర్‌సీఎస్ రక్తనిధి కేంద్రం నిర్వహించగా తరువాత ప్రభుత్వం దీన్ని తమ పరిధిలోకి తీసుకుని కొనసాగిస్తుండడంతో పూర్తి బాధ్యతలను ఆస్పత్రి వర్గాలు స్వీకరించి రక్తసేకరణపై ప్రత్యేక దృష్టి సారించి అధిక రక్త నిల్వలకు కృషి చేస్తున్నారు. గతంలో ఎవరికైనా రక్తం అవసరమైతే రూ.850లు చెల్లించి ఒక యూనిట్ రక్తం ప్యాకెట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు అలా కాకుండా పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి రక్తం అవసరమైతే ఉచితంగా అందిస్తున్నారు. సేకరించిన రక్తం బ్యాగ్‌లు రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, సికిల్‌సెల్ ఎనీమియా, తలసీమియా, డయాలసిస్ పేషెంట్లకు రక్తం అవసరం పడుతోంది, వారితో పాటు రక్త హీనత రోగులు కూడా ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటారు. మరి ఇంతటి అవసరమైన రక్తదానాన్ని ప్రోత్సహించి ప్రజలు, ముఖ్యంగా యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేస్తే భవిష్యత్‌లో ఎంతోమందికి సహాయ పడినట్లు అవుతుందని రక్తనిధి కేంద్రం ఉద్యోగులు కోరుతున్నారు.

రక్తదానం సామాజిక సేవ



సామాజిక సేవగా భావించి ఇప్పటివరకు 97సార్లు రక్తదానం చేశాను. మరొకరి ప్రాణపాయ స్థితిలో నా రక్తం అవసరం పడడం ఆనందంగా భావించి ముందుకు వెళ్తున్నా.

–బోటు రామకృష్ణ, రెడ్ క్రాస్ సభ్యుడు

ఒకరి ప్రాణం కాపాడానన్న తృప్తి



ఇప్పటివరకు 101సార్లు రక్తదానం చేశాను. ఒకరి ప్రాణాన్ని కాపాడమనే తృప్తి రక్తదానం చేయడంలో ఉంటుంది. రక్తదానం వల్ల ఎంతో ఆనందంగా, శరీరం నూతన రక్తంతో ఉల్లాసంగా ఉంటుంది. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవు. నేను నా మిత్రులందరికీ రక్తదానం చేయమని సలహా ఇస్తూ ఉంటాను.

–డీవీవీ గుప్తా, వైకేఎం కాలనీ, పార్వతీపురం

అపోహలు వీడాలి



రక్తదాతలు అపోహలను వీడి ముందుకు రావాలి. రక్తదానం మూలంగా ఆరోగ్యం మరింత ఉత్సాహంగా మారుతుంది. ఏరియా ఆస్పత్రి పరిధిలో మూడు రక్తనిల్వ కేంద్రాలను కురుపాం, సాలూరు , బొబ్బిలి పీహెచ్‌సీలలో ఏర్పాటు చేసి ఆయా ప్రాంత రోగులకు రక్తనిల్వలు అందుబాటులో ఉండేటలా చూస్తున్నాం.

– డా. వాగ్దేవి, పార్వతీపురం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాల తనిఖీ



బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎస్సై కె.నీలకంఠం అన్నారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర రహదారిలో సువర్ణముఖినదిపై ఉన్న వంతెన వద్ద ఆయన ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రహదారిపై రాత్రిపూట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున వాహన చోదకులకు అవగాహన కల్పిస్తూ ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరిస్తున్నామన్నారు. అలాగే వాహనం నడపడానికి లైసెన్స్ లేకుండా, చిన్న పిల్లలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఉన్నతాధికారులు గుర్తించి వాహనాలను తరచూ తనిఖీ చేసేందుకు మార్గదర్శకాలు విడుదల చేశారన్నారు. దీంతో వాహనాలు తనిఖీ చేయడం, ప్రభుత్వానికి బాకీ ఉన్న అపరాధ రుసుం చెల్లించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే వాహనాల్లో అధిక లోడ్, మితి మీరిన వేగం వల్ల వచ్చే అనర్థాలు వివరిస్తున్నట్లు చెప్పారు. వాహన చోదకులు విధిగా వాహన చట్టాలపై అవగాహన కల్పించుకుని రోడ్డుపై వాహనాలు నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌ల నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

పార్వతీపురం టౌన్: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పార్వతీపురం మన్యం జిల్లా నూతన యూనియన్‌ను ఏపీపీహెచ్‌సీడీఏ ప్రెసిడెంట్ డాక్టర్ రఘుకుమార్, ఏపీఎన్‌జీఓ అధ్యక్షుడు కిశోర్, జనరల్ సెక్రటరీ డాక్టర్ వినోద్ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేశారు. ఏపీఎంసీఏ పార్వతీపురం ప్యానల్ మెంబర్స్‌ను ఎన్నుకోగా సీహెచ్ జగదీష్‌ను ప్రెసిడెంట్‌గా, రామకృష్ణ జనరల్ సెక్రటరీగా, ప్రశాంత్, సరిత వైస్ ప్రెసిడెంట్‌గా, రాజేశ్వరి, జాకబ్ ట్రెజరర్స్‌గా ఇతరులను ప్యానెల్ మెంబర్స్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఏపీపీహెచ్‌సీడీఏ ప్రెసిడెంట్ డాక్టర్ రఘు మాట్లాడుతూ సీహెచ్‌ఓ అసోసియేషన్ అభివృద్ధి కోసం తన సహకారం అన్ని విధాలా అందిస్తానని చెప్పారు. ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిశోర్ మాట్లాడుతూ ఇది చాలా శుభపరిణామమని ముఖ్యంగా జిల్లాలో ఉన్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో కృషి చేస్తానన్నారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ సీహెచ్‌ఓల పనితీరు బాగుదని మరింత మెరుగ్గా ఉండాలని కోరుతున్నామన్నారు. జగదీష్ మాట్లాడుతూ యూనియన్‌ను నడిపిస్తూ అధికారుల ముందుకు సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరిస్తామని మాటిచ్చారు.

సంక్షేమం వివరిస్తూ.. సమస్య తెలుసుకుంటూ..



కొట్టుపరువు గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీసీఎం రాజన్నదొర

- కొట్టుపరువులో సాగిన గడగడపకు మనప్రభుత్వం
- పాల్గొన్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



దివ్యాంగునికి సీఎం సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను అందిస్తున్న గిరిజనశాఖమంత్రి రాజన్నదొర

సాలూరు/మక్కువ: ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమపథకాలను వివరిస్తూ, గ్రామాలలో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ రెండురోజులుగా మండుటెండను సైతం లెక్కచేయకుండా డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఏజెన్సీ గ్రామాల్లో పర్యటిస్తూ గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సాలూరు మండలంలోని మావుడి సచివాలయం పరిధి కొట్టుపరువు, కె.కొత్తవలస, బూర్జి గ్రామాలలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గిరిజనశాఖమంత్రి రాజన్నదొర నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి, ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమపథకాలను వివరించారు. సీఎం సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను అందించారు. గ్రామాలలో సమస్యలుంటే తెలియజేయాలని కోరగా, ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని, గతంలో ఎన్టీఆర్ గృహాలు వర్షాలకు కారిపోతున్నాయని, నాడు, నేడు నిధులతో పాఠశాల అభివృద్ధిచేయాలని ప్రజలు కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కార్యక్రమానికి హాజరుకాకపోవడంతో, సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీస్‌లు జారీ చేయాలని ఎంపీడీవో పార్వతికి డిప్యూటీ సీఎం రాజన్నదొర సూచించారు.

పింఛన్‌దారుల ఇంటికే పింఛన్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రజలు సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని స్పష్టం చేశారు. విద్య, వైద్యం, రహదారి సౌకర్యం ప్రతి గ్రామానికీ అందించాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. ప్రతినెల 1వతేదీకే పింఛన్ సొమ్ము నేరుగా పింఛన్‌దారుల ఇంటివద్దకే వలంటీర్లు వెళ్లి అందిస్తున్న ఘనత మనరాష్ట్రానికి దక్కుతుందన్నారు. ప్రజల ఇంటివద్దకే ప్రభుత్వసేవలందించాలన్న ఉద్దేశంతో సచివాలయం, వలంటీరు వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటుచేసిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధిచెందుతుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా మనమంతా చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మావుడి, కొట్టుపరువు సర్పంచ్‌లు పీడిక సుదర్శనరావు, కొండతామర నరశింహులు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్ పర్సన్ దండి అనంతకుమారి, ఎంపీటీసీ ఆదయ్య, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ చిప్పాడ రామారావు, జిల్లా ప్రధానకార్యదర్శి దండి శ్రీను, మాజీ సర్పంచ్ రాగాల రాజారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అల్లూరి ప్రాణత్యాగం మరువలేనిది

- డిప్యూటీ సీఎం రాజన్నదొర



అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర




పార్వతీపురం టౌన్: అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే జోగారావు

సాలూరు/మక్కువ: దేశస్వాతంత్య్రం, గిరిజనుల హక్కులకోసం ప్రాణత్యాగం చేసిన, స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు ప్రాణత్యాగం మరువలేనదని గిరిజనశాఖమంత్రి, డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీసీఎం రాజన్నదొర మాట్లాడుతూ ి అనేక మంది గిరిజనులతో కలిసి అల్లూరి సీతారామరాజు బ్రిటిష్‌వారితో దేశస్వాతంత్య్రం కోసం పోరాడారన్నారు. అప్పటి నుంచి, ఇప్పటివరకు గిరిజనులు అటవీహక్కు సమస్యతో బాధపడుతున్నారన్నారు. ఫారెస్ట్ కన్సర్వేటివ్(కేంద్ర అటవీహక్కు చట్టం) అడ్డంకిగా మారిందన్నారు. సాలూరు, పాచిపెంట మండలాల్లో 11రహదారులు మంజూరుకాగా, ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చేందుకు మూడు సంవత్సరాలు పట్టిందని, ఇంకా ఒక రహదారి నిర్మణానికి క్లియరెన్స్ రాలేదన్నారు. గిరిజనులు అడవిలోపుట్టి, పెరగగా, బతికినంతకాలం అడవిలో నివసించేందుకు, రహదారుల నుంచి నడిచేందుకు అటవీహక్కు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారన్నారు. కింతలపాలెం వద్ద అల్లూరి సీతారామ రాజును కాల్చిచంపిన ప్రదేశంలో ఆయన విగ్రహాన్ని నిర్మించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. త్వరలో స్మృతి వనం సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. చింతపల్లిలో బ్రిటిష్‌కాలంలో కొల్లగొట్టిన పోలీస్‌స్టేషన్‌ను పునర్నిర్మాణానికి కేంద్రప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. అటువంటి మహనీయుడు పేరున, జిల్లా పేరు పెట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. చింతపల్లి మండలం తాజంగిలో సుమారు 35కోట్లతో అల్లూరిసీతారామరాజు మ్యూజియం, రుషికొండలో రీసెర్చ్‌సెంటర్ నిర్మించినట్లు ఆయన తెలిపారు.

బ్రిటిషర్ల గుండెల్లో విప్లవ బాణం అల్లూరి

పార్వతీపురంటౌన్: బ్రిటిషర్ల గుండెల్లోకి దూసుకుపోయిన విప్లవ బాణం అల్లూరి సీతారామరాజు అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు అల్లూరి వర్ధంతి సందర్భంగా మండలంలోని బాలగుడబ గ్రామంలో స్థానిక ప్రజలు నూతనంగా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు అందరూ కలిసి అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో అల్లూరి సీతారామరాజు గెరిల్లా పోరాటం ద్వారా వెనుకబడిన వర్గాల గిరిజనులను బ్రిటిష్ వారి కబంధహస్తాల నుంచి విముక్తి కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పండు, మాజీ సర్పంచ్ మువ్వల సత్యం నాయుడు, ఎంపీటీసీ వి.నీలవేణి, వైస్ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువత, ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన తప్పెటగుళ్ల ప్రదర్శన



భామిని: గ్రామీణ జానపదాలు అంతరించిపోతున్న వేళ అప్పడప్పుడు తప్పెటగుళ్లు ప్రదర్శనలు గుండె నిండా ఆనందం నింపుతున్నాయి. భామిని మండలం నేరడి బీలో తప్పెటగుళ్ల ఆటగాళ్లు ఆదివారం ఆట, పాటలతో అలరించారు. శనివారం నుంచి గ్రామంలో బెండి కుటుంబాలు చేపట్టిన ఇంటి దేవత పండుగల్లో పాల్గొని ఆకట్టుకున్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సర్పంచ్ ఇందుమతి తదితరులు

గరుగుబిల్లి: గ్రంథాలయ శాఖ ద్వారా సోమవారం నుండి నిర్వహించనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ కె.ఇందుమతి అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో వున్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం నుండి జూన్ 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎస్.మధుసూదనరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు క్రీడలు, పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు బహుమతులను ఇవ్వనున్నట్లు తెలిపారు.

పది ఫలితాల్లో బాలికలదే పైచేయి

- ప్రతిభ కనబర్చిన ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు



బి.యోగ్యశ్రీ



చొక్కాపు భవాని



ఆరిక చరణ్‌తేజ



చుక్కల భానుప్రసాద్

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యను ప్రోత్సహించడంతో పదోతరగతి పబ్లిక్ పరీక్షాఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. అందునా ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన ఇంగ్లీష్ మీడియంలో ఎక్కువమంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. శనివారం ప్రకటించిన పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో బాలికలు అత్యధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించడంతో పాటు అధికంగా మార్కులు కూడా తెచ్చుకున్నారు. సీతానగరం ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్‌మీడియంలో 53 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనగా 49 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో తెలుగు మీడియంలో చొక్కాపు భవాని 558 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. అలాగే జోగింపేట గిరిజన ప్రతిభా విద్యాలయంలో 43 మంది పబ్లిక్ పరీక్షల్లో పాల్గొనగా 42 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.వెంకటినాయుడు తెలియజేశారు. జోగింపేట కేజీబీవీ నుంచి 36 మంది విద్యార్థినులు పరీక్షల్లో పాల్గొనగా 24 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో బి.యోగ్యశ్రీ 573 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ జి.హరిత చెప్పారు. ఆర్.వెంకంపేట ఉన్నత పాఠశాలలో 82.60 శాత మంది ఉత్తీర్ణులయ్యారని వారిలో ఎం. నాగసాయి 496 మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం భాస్కరరావు తెలియ జేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాలయంలో 87శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా జి.అనిల్ కుమార్ 523 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. గాదెలవలస ఉన్నత పాఠశాలలో 83 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 48 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో ఏగిరెడ్డి జాహ్నవి 541 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. అలాగే బూర్జ ఉన్నత పాఠశాలలో 73 మందికి గాను 50 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా ఎం.దుర్గారావు 561 మార్కులు, పెదంకలాం గ్రామానికి చెందిన చుక్కల భానుప్రసాద్ 519 మార్కులు సాధించారు.

గ్రామస్తుల అభినందనలు



బలిజిపేట: పెదపెంకిలో పది ఫలితాల్లో మంచిమార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న గ్రామస్తులు

బలిజిపేట: పది ఫలితాల్లో పెదపెంకి ఉన్నత పాఠశాల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులను గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. 576మార్కులతో టాపర్‌గా నిలిచిన లిఖిత, 574మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచిన హాసినను గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ చప్ప సత్యం నాయుడు ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల వంతున, సారిపల్లి బాలాజీ మాస్టారు ఒక్కొక్కరికి రూ.1,016వంతున ప్రోత్సాహకాలు అందించారు. భవిష్యత్తులో మంచి విద్యాభ్యాసాన్ని అభ్యసించి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఈర్ల సంజీవనాయుడు, జగన్, యువకులు పాల్గొన్నారు.